ప్రత్యక్షశయ్య

[నిజంగా జరిగిన కథ]

శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

శ్రీ శ్రీ శ్రీ వత్సవాయి చతుర్భుజతిమ్మజగపతి మహారాజు పెద్దాపురరాజ్యం పరిపాలిస్తూ వున్న రోజులు—

రాజ్యం అంతా సర్వవిధాలా సుభిక్షంగా వుంది.

కళాకుశలు లందరూ రాజపూజ్యత అనుభవిస్తున్నారు.

కాని, వారంటే దివాన్జీకి వల్లమాలిన కోపం.

ఏవో నాలుగు కబుర్లు చెప్పి, ఇంద్రుడ వనీ, చంద్రుడ వనీ పొగిడి, వేలకొద్దీ డబ్బు కాజేస్తారనీ, అగ్రహారాలు కూడా కొట్టేస్తా రనీ ఆకోపం.

కానయితే, అతగాడు బ్రాహ్మడే; వైదికుడున్నూ. కొంచెమో గొప్పో చదువుకున్నవాడు కూడాను.

కాని అతను పోట్టి అంకెలపోగు.

అతనికి డబ్బే పావనం.

ప్రజలవల్ల అణాపైసలు నిక్కచ్చిగా వసూలు చెయ్యడం—అలా చెల్లించగలగడానికి, ఆ ప్రజలకు తగిన వసతులు కల్పించడం—ఇంతే అతని లోకం.

పది డబ్బులు వస్తా యంటేనే వొక డబ్బు ఖర్చు పెట్టడం అతని పద్ధతి.

అంచేత, పండితులకు అతని దర్శనం సాధారణంగా అందరాని ఫలంగా వుంటూ వుంటుంది.

మహారాజు దర్శనం అతని ద్వారానే కావాలి కనక అది మరీ దుర్ఘటం అవుతూ వుంటుంది.

కాని మహారాజు విద్యాప్రియుడు.

కళ లంటే అతనికి నిద్రాహారా లక్కర్లే దన్నంత ప్రీతి.

ఇంతేకాక,—

ఆ రాజ్యంలో, ఆ ప్రధానాధికారి యెంత విద్యావిముఖుడో, అతనికింది ఆ అప్రధానాధికారులు అంత విద్యాసుముఖులు.

వారిలో కొందరు కళాకుశలులున్నూ వున్నారు.

ఈసన్నివేశమే లేకపోతే, పండితులకు, రాజసభలోనే కాదు, పెద్దాపురప్పట్నంలోనే ప్రవేశం లేకపోవును.

ఏతావతా:

ఈసౌకర్యం వినియోగించుకుని వొకనాడు, వొక బ్రాహ్మణయువకుడు, కోటలోనే — కచేరీగదిలోనే దివాన్జీయెదటికి వెళ్లగలిగాడు.

అదృష్టవశంవల్ల, ఆవేళ, మహారాజు పక్కగదిలోనే మిత్రులతో దశావతారీ ఆడుతూ వుండడం తటస్థపడింది.

ఆ కింది అధికారులు ఆయువకుడికి యీ సంగతి కూడా చెప్పి, దివాన్జీతో దొమ్ములాడి అయినా మహారాజు దృష్టి ఆకర్షించుకో మని హెచ్చరించారు.

౧

అధికారదర్పానికి దీర్ఘానుభవం సాయపడి దివాన్జీ బిర్రుగా చూడగా, పాండిత్యగర్వానికి కింది అధికారుల ప్రోత్సాహం జతపడి యువకుడు అలవోకగా చూశాడు.

ఇది దివాన్జీ కళ్లల్లో కారపుగుండ కొట్టింది.

యువకు డది గుర్తించి, మొదట నమ్రుడై "నమో మహద్భ్యః. మాది పలివెలతాణాకి చెందిన వొక కుగ్రామం. నాపేరు బులుసు రామగోవిందశాస్త్రి" అని అంజలిబంధంగా విన్నవించి, తరవాత "నీసంగతంతా తెలుసుకునే వచ్చానయ్యోయ్" అన్నట్టు సుతారంగా తల పంకిస్తూ నిటాగ్గా నుంచున్నాడు.

దీంతో గాయం రేగినట్టయి, పురపుర చూస్తూ, "యిక్కడి కెలా వచ్చారండీ?" అని తల యెగరవేసుకుంటూ అడిగాడు దివాన్జీ.

"చెప్పలేను. ఎంచేత నంటే? ఇక్కడికి రావడంలో నా ప్రజ్ఞా, నాప్రయత్నమూ కూడా లేవు. కేవలమూ తమ దివ్యతేజస్సే నన్నిక్కడి కాకర్షించింది. తమ అధికారమే నన్నిక్కడ నుందోబెట్టింది" అంటూ బెల్లిస్తూ చూశాడు శాస్త్రి.

ఇది విని, పక్క గదిలో మహారాజు చకితుడై ద్వారంకేసి చూశాడు.

కాని దివాన్జీమాత్రం యిది వినయమో అవినయమో, పొగడ్తో తెగడ్తో కూడా గుర్తించుకోలేక నీరవు డయిపోయాడు.

అది గ్రహించి "ఎక్కడికక్కడే పద్మవ్యూహం. అడుగడుగునా విచ్చుకత్తులతో పహరాలు. నిజంగా మానవమాత్రుల కిది సంభవ మేనా? కాని కళ్లు మూసి తెరిచా టప్పటికి నే నిక్కడున్నాను. ఇక చెప్పడానికేం వుందీ?" అని తల యెగరవేసుకుంటూ మళ్లీ అడిగాడు శాస్త్రి.

ఇది విని దివాన్జీ మరీ నీరవు డయిపోయాడు.

దీంతో మహారాజు కళాప్రీతి ఉద్బుద్ధ మయింది.

కొంతసేపు అధికారీ, ఆగంతుకుడూ అభావదృష్టులు పరుపుకున్నారు.

తరవాత ప్రయత్నపూర్వకంగా కంఠం స్వాధీనపరుచుకుని "అయితే యేమి టండీ? ఎందుకోస మండీ మీ రాకా?" అని చిమచిమలాడుతూ అడిగాడు దివాన్జీ.

"చిత్తం చిత్తం. ఒక్కమాటు పురాణకాలక్షేపం చేసి ప్రభువుని మెప్పించా లనీ—"

"మెప్పించీ?"

"ఎంతో కొంత సత్కారం—"

"అదీ అసలు సంగతి" అని చెయ్యి విదిలించుకుంటూ అందుకున్నాడు దివాన్జీ.

"నే నెరగనూ? ఎవరు వేంచేసినా అందుకే. ఆ ద్రవ్యాశ శ్రవ్యంగా వుండడానికే యీ చిలవలూ పలవలూనూ"

ఆటగాళ్లు చకితులై ప్రభువుని చూడగా, ప్రభువు ఒక చెవి యిటు వొగ్గాడు.

"తమరు సరిగా సెలవిప్పించారు. ఏమంటే? మనుష్యుడు చేసే ప్రతీ పనిలోనూ యీ పూత తప్పదు. పైగా, నావృత్తిలక్షణం కూడా అదే"

"సంతోషించాం"

"ఎంత దురుసుతనమూ" అనుకుని ఆటగాళ్లు స్తబ్ధు లయినారు.

మహారాజు చెవిలో అపశ్రుతి దెబ్బ కొట్టింది.

శాస్త్రి కొంచెం వుద్రిక్తు డయినాడు.

అరసికత తొందరపెట్టగా యిలా అనేశాడు; గాని మహారాజు వినేశా డేమో అని అంతలో స్వగతంగా పిసుక్కుని, వెంటనే ధోరణి మార్చి "నుంచునే వున్నారు, కూచోండి. అయితే, యేం చదివారూ మీరూ?" అంటూ గుర్రం దిగి అడిగాడు దివాన్జీ.

"తమ సన్నిధిని కూచున్నా నుంచున్నట్టే, నుంచున్నా కూచున్నట్టే. పై పెచ్చు, తమరు ముందే సంతోషించారు గాని పరిశీలన అంతా ఖిగిలే వుంది. కనక నుంచుని మాట్టాడ్డానికే నాకు సెలవిప్పించండి. మరి ప్రకృతం. నేను ఉభయభాషల్లోనూ పంచకావ్యాలూ చదివా నండి" అని గంభీరంగా చూస్తూ చెప్పాడు శాస్త్రి.

ఇది దివాన్జీని కొంచెం వుద్రిక్తుణ్ణి చేసింది; కాని పైకి చల్లపడ్డట్టు కనపడుతూ "థరవాత?" అని అడిగాడతను.

చేత నవునంటే నమ్మెయ్యవలసిం దేనా?" అని మాట పూర్తి చేశాడు.

"ఏం నమ్మితే?"

చురుగ్గా చూసి "ఏమా? ఎవర్ని కూర్చోబెట్టినా చదివించగలరా?" అని టోకాయించి అడిగాడు దివాన్జీ.

"ఆ"

"ఏమాత్రం చదువు వచ్చివున్నానా?"

"ఆ"

"వాచకం ధారాళంగా లేకపోయినానా?"

ఎదురొమ్ము విరుచుకుంటూ మళ్లీ "ఆ"అన్నాడు శాస్త్రి.

ఇది విని చేతిలోవున్న ముక్కలు కిందపడేశాడు ప్రభువు.

ఆటగాళ్లు ముగ్గురూ యెవరిచేతిలో వున్న ముక్కలు వారు కలిపేసుకుని, చూపులు మహారాజు మొగంమీదా, చెవులు యీ సంభాషణమీదా నిలుపుకున్నారు.

కాని, విశాఖపట్నం సీటీకొళాయీలు పుటుకూ పుటుకూ రెండేసి చుక్కలు రాల్చి యిగుర్చుకు పోయేటట్టు "అసాధ్యం"అనీ, "నమ్మడానికి వీల్లేదు"అనీ మాత్రం గొణిగి, మొగం వంచుకుని దివాన్జీ యేదో కాగితం చూసుకోసాగాడు.

అది నిర్లక్ష్యంగానూ, తనయెడల తిరస్కారభావంగానూ గ్రహించి, చాలా బాధపడి "సాధ్యమా అసాధ్యమా అంటే అది మనిషిని పట్టి వుంటుంది. ఈ విషయం గ్రహించడంకూడా మనిషిని పట్టే వుంటుంది. కాగా, యిలాంటి సందర్భాలు తటస్థపడ్డప్పుడు సహృదయులు చెయ్యదగినది పరీక్ష" అన్నాడు శాస్త్రి.

కాని దివాన్జీ మాట్టాడలేదు. మొగ మయినా యెత్తలేదు.

"అందుకు పూనుకోకపోతే ఆ సహృదయతకు వినియోగం యేదీ? అసలు దాని అస్తిత్వానికి నిదర్శనం యేమిటీ?" అని మళ్లీ అడిగాడు శాస్త్రి.

దివాన్జీ హృదయం దడదడ లాడింది. అయినా అతను మాట్టాడలేదు.

"నిజానికి తమ రిప్పుడు చేస్తూ వున్నది కూడా పరీక్షే; అయితే, రకం మట్టుకు మారిస్తే గాని అది యిక్కడ సమన్వయించదు" అని కొంటె చూపులు చూశాడు శాస్త్రి.

అప్పుడున్నూ దివాన్జీ చలించలేదు.

"పోనీ, తమ రున్న స్థితిలో నన్ను పరీక్షించడం సాధ్యపడకపోవచ్చు. ఇందుకోసం తమ రెలాంటి హేమాహేమీలను తెచ్చినా నాకు సమ్మతమే. ఇందులో వోడిపోతే తమరు స్వయంగా నా కెలాంటి శిక్ష విధించినా నేను సిద్ధమే"

ఇది విని అక్కడ ఆటగాళ్లు మహారాజుకేసి మిడుతూ మిడుతూ చూశారు.

మహారాజు ద్వారంకేసి పులుకూ పులుకూ చూశాడు.

ఇక్కడ దివాన్జీ "మా కిదే పనా? సంభవాలు చూడ్డానికే పీలుపడదే, అసంభవాల కోసం మేము పనులు మాను కూర్చోవలసిందేనా?" అంటూ కరుగ్గా అడిగాడు.

ఇది శాస్త్రికి మనస్సు నొప్పించింది.

"ఇది పని కాకపోతే కాదూ?" అంటూ అందుకున్నా డతను.

"ఈస్థలం సర్వవిధాలా ప్రజలను ఆజ్ఞపెట్టడానికి సమర్థ మయినది. ఆకారణంవల్ల యిది అందరికీ అందుబాటులో వుండతగ్గది కావడం లేదూ? ఇదిన్నీ కాక: సంభవాల కోసం తమదాకా రా నక్కర్లేదు. తమ వంటి పదస్థులు చిత్తగించవలసినవి అసంభవాలే"

దీనిమీద దివాన్జీకి కోపమే వచ్చింది; కాని కాదనడం యెలాగా? అతనికి దారి తోచలేదు.

పైపెచ్చు "ఇంతదూరం ముదరనివ్వడం పొరబాటు" అని తప్పే తోచింది. మాట్టాడలేక కళ్లప్పగించి వూరుకున్నాడు.

"పూర్వుల తపఃప్రభావంవల్ల తమ రీ మహోన్నతపదవి పొందగలిగారు. ఆ తపఃప్రభావం తమకి కళాభిరుచి కలిగించకపోవడం అసంభవం కాదూ? కనక తమవంటివారే పెదవి విరిస్తే యిక విద్యలకు గతి యేదీ?"

దీనిమీద "మాట్లాడితే ప్రతివాడికీ యిదొక వేలంబం. విద్యలుట విద్యలు" అని గొణుక్కుంటూ దివాన్జీ మొగం వంచుకున్నాడు.

ఈ గొణుగుడు మహారాజుకి వుద్రేకం కలిగించింది.

వెంటనే అతను ద్వారపాలికకేసి చూసి "సభకి సెలవయిందని చెప్పు" అన్నాడు.

ఇది శాస్త్రికి కోకిలకూజితంలా వినపడింది.

దాంతో "యేం, అయిందా ?" అన్నట్టు ముదలకింపు చూపు చూశాడతను.

మహారాజు మాటకీ, ద్వారపాలిక రాకకీ కూలిపోయిన దివాన్జీ దీంతో చితికిపోయాడు.

౪

సరిగా జాముపొద్దువేళ సభ కూడింది.

తెల్లని మసలందుమీద మహారాజు సలక్షణంగా కొలువుతీరాడు.

రాజబంధువులూ, సామంతులూ, అధికారులూ, పండితులూ, పౌరప్రముఖులూ "యెప్పుడెప్పు"డని ఆత్రపడుతూ, ప్రభువుని పరివేష్టించి వున్నారు.

క్షణాలు గడియలుగానూ, గడియలు క్షణాలుగానూ మారిపోతున్నాయి.

మహారాజు కళ్లల్లోనూ, శాస్త్రి చూపుల్లోనూ అంకితమై, గాంభీర్యం, కొలువు అంతా ఆకట్టి వుంది.

కొంతసేపటికి, ప్రభువు ఇంగితం కనిపెట్టి, ఆస్థాన పౌరాణికుడు ఆంధ్రమహాభారతం తెచ్చి శాస్త్రి కందించి తప్పుకున్నాడు.

అతని వెనకనే పదహారేళ్ల చామరగ్రాహిణి వచ్చి, ముందు పాదాభివందనం చేసి, తరవాత శాస్త్రి యెడమదిక్కున కూచుంది.

అది చూసి సభ్యులందరూ "కత్తులమీద పరీక్ష" అనుకుంటూ వుండగా, సుతారంగా సూత్రం విప్పి, శాస్త్రి, పౌరాణికుడికేసి చూశాడు.

ప్రభువు మేనమామ—తొంభైయేళ్ల వృద్ధు—దంతులూరి వేంకటపతిరాజు వెండిమీసాలు సవరించుకుంటూ "ఊరుభంగం ఘట్టం తీయించండి" అని బోసినోరు చప్పరించుకున్నాడు.

అందుకు సభ్యులందరూ వుత్సుకులు కాగా, శాస్త్రికూడా పరమోత్సాహం పొంది "మహాప్రసాదం" అంటూ మొదట ఆ ఆజ్ఞ అంజలిబంధంతో అందుకుని, తరవాత "సంస్థానానికి తగిన ఘట్టం. శయ్యకి తగిన ఘట్టం. నా బిరుదుకిన్నీ తగిన ఘట్టం. నే నేది నిరీక్షిస్తున్నానో అదే మమ్మేలినవారు సెల విప్పించారు. అయితే వొక్క మనవి" అని మళ్లీ దోసిలి వొగ్గాడు.

"సెల విప్పించండి" అన్నాడు ప్రభువుపక్షంగా వేంకటపతిరాజు.

"ముందొక పెట్టె తెప్పించి నా కుడివేపున వుంచాలి"

"తరవాతా ?"

"ఇక్కడ వున్నవారందరూ తమ దగ్గిర వున్న ఆయుధాలు అందులో వుంచెయ్యాలి"

ఇది విని సభ్యులందరూ మొగమొగాలు చూసుకున్నారు. మొగమాటం విడిచిపెట్టి అనందట్లో "ప్రభువువారికీ,పసిపిల్లలకూ, భటులకూ కూడా మినహాయింపు లేదు" అని కచ్చితంగా చెప్పేశాడు శాస్త్రి.

ఉలిక్కిపడి మేనమామ ప్రభువుకేసి చూశాడు. ప్రభువు వింతపడ్డాడు; కాని "యిప్పించెయ్యండి"అన్నాడు.

కళ్లు మూశాటప్పటికి పెట్టె రావడమూ, మళ్లీ తెరిచాటప్పటికి చిన్న చాకులు కూడా అందులో నిక్షిప్తాలు కావడమూ జరిగిపోయింది.

౫

"ఏదీ, చదువు పిల్లా" అంటూ చామరగ్రాహిణికి పుస్తకం అందించాడు శాస్త్రి.

పుస్తకంలో రాత చూస్తే ముత్యాలకోవ.

పిల్ల కళ్లు చూస్తే ఆకర్ణాంతాలు.

కాని నాలుక మాత్రం కొంచెం ప్రయత్నించగా వర్ణక్రమమే నడవలేదు.

అది చూసి సభ్యు లందరూ "లాభం లే"దను కున్నారు; గాని శాస్త్రి దోసిలి వొగ్గి, నమ్రుడై "సెల వా?" అని అడిగాడు.

"ఒక్కటే సెలవు" అనుకున్నారు సభ్యులు; కాని వేంకటపతిరాజు "కానివ్వండి" అన్నట్టు తలా చెయ్యీ వూపాడు.

వెంటనే "యిలా చూడు పిల్లా" అన్నాడు శాస్త్రి.

పిల్ల చూసింది.

"పాడగలవా ?"

"చేతకా దండి"

"ఏం ?"

"సంగీతం నేర్చుకోలే దండి"

"సాహిత్యమో ?"

"లేదండి"

"పోనీ, ఆడగలవా ?"

"ఆ" అన్నట్టు పిల్ల తల వూపింది.

"బాగుంది. అయితే మొగం పైకెత్తూ"

పిల్ల చెప్పినట్టు చేసింది.

"ఉలిక్కిపడ కేం"

"అలాగే" అన్నట్టు మళ్లీ తల వూపింది.

అప్పుడు శాస్త్రి పిల్ల తలమీద ఎడమచెయ్యి వుంచి, కళ్లు మూసుకున్నాడు. ఒక్క క్షణం నిటాగ్గా కూచుని పైకి చూస్తూ యేదో మంత్రం పునశ్చరణ చేశాడు. మరొక్క క్షణం కుడిచేతి వేళ్లు సవరించు కున్నాడు.

తరవాత కళ్లల్లోకి గంభీరంగా చూస్తూ పిల్ల కంఠం నిమిరాడు.

ఇదంతా అయేటప్పటికి పిల్ల కళ్లు మూసుదిరుం.

"అదేం ?" అని అడిగాడు శాస్త్రి.

"కళ్లు మూసుకుపోతున్నాయండి"

"ఒక్కమాటు చూడు"

"చూడాలని లేదండి. చూడలేనండి"

"బాధగా వుందా ?"

"లేదండి"

"మరెలా వుంది ?"

"కంఠంలో వొణుకు పుడుతోందండి"

"ఏమనిపిస్తోంది ?"

"పాడా లనిపిస్తోం దండి"

"అయితే యింకేం ? ఏదీ వొక్క రాగం—"

"దారి దొరకడం లేదండి"

శాస్త్రి ప్రభువుకేసి చూశాడు. ప్రభువు మేన మామకేసి చూశాడు. మేనమామ యిటు తిరిగి శాస్త్రి కేసి చూశాడు.

సభ్యులు గుబగుబలాడిపోయారు.

అప్పుడు శాస్త్రి, వొక్కమాటు మందహాసం చేసి, కుడిచెవిమీద చెయ్యి పెట్టుకుని, తన నోరు పిల్ల కుడిచెవిలో వుంచి "రేం రేం" అంటూ రేగుప్తి రాగం అందుకుని వొక్క విసురు విసిరాడు.

వెంటనే పిల్ల, శాస్త్రి విడిచినచోట అందుకుని వొక్క గడియ ఆలాపన చేసి సభ అంతా గలగల్లాడిం చేసింది.

దాంతో ప్రభువు మొగం వికసించింది.

మేనమామ జోసినోరు వివృతం అయింది.

దివాన్జీ మొగం వాలిపోయింది.

౬

అటు సభ్యుల మొగాలమీద ఆశ్చర్యజ్యోత్స్న అంతరించకుండానే యిటు శాస్త్రి మళ్లీ నిటాగ్గా కూచున్నాడు.

ఎడమచెయ్యి పిల్లతలమీద వుంచి మళ్లీ కళ్లు మూసుకుని వొక్కక్షణం పునశ్చరణ చేశాడు.

ఉత్తరక్షణంలో కుడిచేత్తో పిల్ల కళ్లు తుడిచి, ఆమె చెవి దగ్గిరగా తన నోరుంచుకుని

"పలపలని మూఁకలోఁ గాల్
నిలువక గుఱ్ఱంబు డిగ్గి నీ కొడుకు గదా
కలితభుజుండై యొక్కఁడుఁ
దొలఁగి చనియె నేమి చెప్పుదుం గురునాథా?"

అని చదివి, తర్జనితో నిర్దేశిస్తూ పుస్తకంలో పిల్లకి ఆపద్యం చూపించాడు.

తన కళ్లు ప్రఫుల్లపద్మపత్రాలు కాగా, వెంటనే ఆమె శాస్త్రి యేస్థాయిలో అందుకున్నాడో ఆస్థాయిలోనే అందుకుని యథాశ్రుతంగా పద్యం చదివేసింది.

అది మొదలు,

గోదావరీప్రవాహం లాగ ఆమె పద్యం చదవడమూ, గుర్రం కదను తొక్కినట్టు అతను అర్థం చెప్పడమూనూ.

అతని ఆవేశం ఆమెకి సంక్రమించింది. ఆమె వుత్సాహం అతన్ని రెచ్చగొట్టింది.

దానిమీద సభ్యు లందరూ జంత్రపు బొమ్మ లయి పోయారు.

సుయోధనోపాలంభం ప్రారంభం అయింది.

మొదట సభ్యులు చకితులై వొకరికేసి వొకరు చూసుకున్నారు. తరవాత వారిలో కొంద రుత్సుకులు కాగా, తక్కినవా రసంతృప్తు లయినారు.

క్రమంగా, వొక పక్షాన కనుబొమ్మ లెగిరాయి. వెంటనే రెండో పక్షాన కళ్లు నిప్పులు కురిశాయి.

ఇది పూర్తికాకుండా సుయోధనుడు ధర్మజుణ్ణి నిరసిస్తూ గదాయుద్ధానికి భీముణ్ణి యేరుకున్నాడు.

దాంతో, వుద్రిక్తు లయి వున్న సభ్యులు కొంద రటూ, కొంద రిటూ కేటాయిం పయిపోయారు.

స్థితప్రజ్ఞుడైన ప్రభువు అందుకే ఆశ్చర్యపడుతూ వుండగా, ఆ ద్వైపాయనహ్రదప్రాంతంలో గదాగదిగానూ, యీ సభలో బాహాబాహిగానూ యుద్ధం ప్రారంభం అయింది.

పెద్ద గందరగోళం అయిపోయింది.

అది చూసి, "ఆ, ఆ" అని కళవళపడుతూ లేచి ప్రభువు వారించగా సమయజ్ఞుడైన శాస్త్రి పిల్లతలమీది తన చెయ్యి తీసేసుకుని, లేచి నుంచుని, ప్రభువుకేసి తిరిగి "అపరాధిని, క్షమధ్వం" అంటూ నమ్రుడై దోసిలి వొగ్గాడు.

ఈ సందట్లో కంగారుపడుతూ లేచి పిల్ల తన స్థానంలోకి వెళ్లిపోయింది.

అప్పటి కప్పుడే సభ్యు లందరూ మొదట చల్లపడి, తరవాత సిగ్గుపడి, చివరికి ఆశ్చర్యపడిపోయారు.

ఉత్తరక్షణంలో ప్రభువు ప్రకృతిలో పడి "మహానుభావా! తమరు మానవమాత్రులు కారు. ఆ సమయంలో తమ రక్కడే వుండివుంటే సుయోధనుడు భీముణ్ణే కాదు; శ్రీకృష్ణుణ్ణి కూడా చితకబొడిచేసి వుండు"నని ప్రశంసిస్తూ అమాంతంగా శాస్త్రిని కౌగిలించుకున్నాడు.

(ఇది జరిగిందీ, విన్నదీని. రచనమట్టుకే నాది)